# ఎన్నికలకు పటిష్ట బందోబస్తు

- క్షేత్రస్థాయి సిబ్బందికి అవగాహన
- చెక్‌పోస్టులు, ఠాణాలను సందర్శించిన రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్



సిటీబ్యూరో, నవంబర్ 2 (నమస్తే తెలంగాణ): ఈ నెల 30వ తేదీన జరుగనున్న అసెంబ్లీ ఎన్నికలకు క్షేత్ర స్థాయిలో ఏర్పాటు చేయాల్సిన భద్రత, బందోబస్తుకు సంబంధించిన విషయాలపై ఠాణాల అధికారులకు రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్ పలు సూచనలు చేశారు. గురువారం కమిషనరేట్ పరిధిలోని మాడ్గుల, యాచారం, ఇబ్రహీంపట్నం, మాల్ తదితర ప్రాంతాలలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులను సీపీ తనిఖీ చేశారు. అక్కడి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. రాచకొండ పరిధిలో 24 చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి, పకడ్బందీగా తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ తనిఖీల్లో ఇప్పటి వరకు రూ.40 కోట్ల నగదు సీజ్ చేశామన్నారు. క్షేత్ర స్థాయిలో విధులు నిర్వహించే కింది స్థాయి సిబ్బంది కూడా ఎన్నికల నిబంధనలపై పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలని సూచించారు. పాత నేరస్తులను బైండోవర్ చేస్తున్నామని, గత ఎన్నికలలో నేరాలు చేసిన వారిపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. మాడ్గుల పరిధిలో గత ఎన్నికల్లో 90 మంది నేరాలకు పాల్పడగా.. వారిని బైండోవర్ చేశామన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్

## జిల్లాలో వయోవృద్ధులు, దివ్యాంగులకు ఇంటి నుంచే ఓటు హక్కు సౌలభ్యం

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్

మేడ్చల్, నవంబర్ 2 (నమస్తే తెలంగాణ): జిల్లాలో వయోవృద్ధులు, దివ్యాంగులు ఇంటి నుంచే ఓటు హక్కును వినియోగించుకునేలా సౌలభ్యం కల్పించినట్లు మేడ్చల్– మల్కాజిగిరి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ పేర్కొన్నారు. జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశపు హాల్‌లో జరిగిన సమావేశంలో జిల్లా కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా మొత్తం వయోవృద్ధ ఓటర్లు 32,921 ఉండగా, 24,751 మంది దివ్యాంగులు ఉన్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు వీరికి ఇంటి నుంచే ఓటు హక్కు కల్పించే విధంగా అధికార యంత్రాంగం చర్యలు చేపట్టిందన్నారు. జిల్లాలోని అర్హత గల వయోవృద్ధులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ గౌతమ్ పేర్కొన్నారు.

## రిటర్నింగ్ కార్యాలయాల వద్ద 144 సెక్షన్

- ఓల్డ్ సిటీపై పోలీసుల ప్రత్యేక దృష్టి

సిటీబ్యూరో, నవంబర్ 2 (నమస్తే తెలంగాణ): ఎన్నికల నామినేషన్ ప్రక్రియ నేటి నుంచి ప్రారంభం కానున్నది. ఈ నేపథ్యంలో రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల వద్ద 144 సెక్షన్ అమలులోకి రానున్నది. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీస్ కమిషనరేట్ల పరిధిలో 29 రిటర్నింగ్ కార్యాలయాలున్నాయి. ఈ ఆంక్షలు ఈ కార్యాలయాల వద్ద ఈ నెల 15వ తేదీ వరకు అమలులో ఉంటాయని అధికారులు తెలిపారు. శుక్రవారం నామినేషన్ల ప్రక్రియ మొదలై.. వచ్చే శుక్రవారంతో ముగుస్తుంది. దీంతో మొదటి రెండు రోజులు ప్రధాన పార్టీల నుంచి నామినేషన్లు తక్కువగా వచ్చే అవకాశాలున్నాయి. సోమవారం నుంచి నామినేషన్ల ప్రక్రియ ఊపందుకునే అవకాశం ఉంది. నామినేషన్ల పర్వం పూర్తయిన వెంటనే ఆయా పార్టీల అభ్యర్థులు ప్రచారంలోకి దూకుతారు. ప్రచారం సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు బందోబస్తును ఏర్పాటు చేస్తూ.. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా నిరంతరం అన్ని ప్రాంతాల్లో గస్తీ నిర్వహిస్తారు. ట్రై పోలీసు కమిషనరేట్ల పరిధిలోని హైదరాబాద్ కమిషనరేట్‌లో సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లు ఎక్కువగా ఉన్నాయి. దీంతో పాతనగరంలో బీఆర్‌ఎస్, ఎంఐఎం, బీజేపీ, కాంగ్రెస్ ఇతర చిన్న చిన్న పార్టీలు కూడా బరిలో ఉండనున్నాయి. గతం కంటే భిన్నంగా ఈ సారి నగరంలో బీఆర్‌ఎస్, ఎంఐఎం, కాంగ్రెస్, బీజేపీల మధ్య హోరా హోరీగా పోరు జరుగనున్నది. దీనిని దృష్టిలో పెట్టుకున్న హైదరాబాద్ పోలీసులు మరింత పకడ్బందీగా బందోబస్తు చర్యలు చేపడుతున్నారు. శుక్రవారం నుంచి పోలీసులకు ఎన్నికల బందోబస్తుకు సంబంధించిన అసలైన పరీక్ష మొదలుకానున్నది.

## 'గ్లాండ్ ఫార్మాసూటికల్'లో ఎక్సైజ్ శాఖ దాడులు

- రూ. 2.37 కోట్ల మిడాజోలం స్వాధీనం

కుత్బుల్లాపూర్, నవంబర్ 2: రాష్ట్ర ఎక్సైజ్ కమిషనర్ ఆదేశాల మేరకు గురువారం కుత్బుల్లాపూర్ గండిమైసమ్మ ప్రాంతంలో ఉన్న ఎంఎస్ గ్లాండ్ ఫార్మాసూటికల్ లిమిటెడ్‌లో ఎక్సైజ్ బృందాలు తనిఖీలు చేపట్టాయి. ఈ తనిఖీల్లో సుమారు 103.46 కిలోలు మిడాజోలం అనే డ్రగ్ నిల్వ ఉన్నట్టు గుర్తించారు. ఈ డ్రగ్స్‌కు సంబంధించిన పత్రాలు చూపించడంలో కంపెనీ యాజమాన్యం విఫలం కావడంతో.. సంస్థ యాజమాన్యంపై కేసు నమోదు చేశారు. సుమారు రూ.2.37 కోట్ల విలువజేసే డ్రగ్స్‌ను సీజ్ చేశారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ శాఖ రంగారెడ్డి జిల్లా డిప్యూటీ కమిషనర్ డేవిడ్ రవికాంత్, అసిస్టెంట్ కమిషనర్ ఎ.చంద్రయ్య, మేడ్చల్ సూపరింటెండెంట్ విజయ భాస్కర్, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ జీవన్‌కిరణ్, మాదవయ్య, ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాస్, సుభాష్‌చందర్, నర్సిరెడ్డి, యాదయ్య, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

## రూ.24 లక్షల బెల్లం స్వాధీనం

ఘట్‌కేసర్ రూరల్, నవంబర్ 2: సారాయి తయారీకి వినియోగించే రూ.22 లక్షల విలువజేసే బెల్లంను ఘట్‌కేసర్ ఎక్సైజ్ శాఖ పోలీసులు స్వాధీనం చేసుకొని, ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. ఘట్‌కేసర్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ సి.మల్లయ్య కథనం ప్రకారం.. మేడిపల్లిలో వాహనాలు తనిఖీ చేస్తుండగా.. లారీలో 4,500 కిలోల బెల్లం రవాణా చేస్తున్నట్లు గుర్తించారు. బెల్లం కొనుగోలుకు సంబంధించిన ఏలాంటి అనుమతి పత్రాలు లేక పోవడంతో వాహనాన్ని, రూ.22 లక్షల విలువజేసే బెల్లంను సీజ్ చేసినట్టు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. నిందితులు ఎస్‌కె. మంజు(35), రామ భద్రయ్య(43)ను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

## ఫోన్ మాట్లాడుతూ.. బస్సు నడిపి

- స్కూల్ బస్సు ఢీకొని బాలుడు మృతి

హయత్‌నగర్, నవంబర్ 2 : స్కూల్ బస్ డ్రైవర్ నిర్లక్ష్యం ఓ బాలుడి ప్రాణం తీసింది. ఈ ఘటన హయత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. కుంట్లూరు గ్రామంలో గణేశ్‌నగర్‌కు చెందిన తన్నీరు శ్రీకాంత్ దంపతులకు కుమార్తె నిషిక, కుమారుడు పవన్ హర్ష కుమార్(3) ఉన్నారు. కుమార్తె పెద్ద అంబర్‌పేటలోని కండర్ షైన్ స్కూల్‌లో చదువుతున్నది. శ్రీకాంత్ గురువారం ఉదయం కుమారుడు పవన్ హర్ష కుమార్‌తో కలిసి కుమార్తెను స్కూల్‌కు పంపించేందుకు కాలనీలోకి వచ్చిన స్కూల్ వ్యాన్ వద్దకు వచ్చి.. వ్యాన్ ఎక్కించాడు. డ్రైవర్ ఈశ్వర్ ఫోన్ మాట్లాడుతూ నిర్లక్ష్యంగా వ్యాన్‌ను ముందుకు తీశాడు. ఆ సమయంలో అక్కడున్న పవన్ హర్షకుమార్‌ను వ్యాన్ ఢీకొట్టి.. పైనుంచి వెళ్లింది. దీంతో బాలుడి తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## భూ వివాదం..

- బావను చంపిన బావమరుదులు
- అక్బర్జాపేటలో దారుణం

మేడ్చల్, నవంబర్ 2 : బావ, బావమరుదల మధ్య తలెత్తిన భూ వివాదం ఒకరి హత్యకు దారితీసింది. ఇద్దరు సోదరులు కలిసి కర్ర, కత్తితో సోదరి భర్తపై దాడి చేసి మట్టుపెట్టారు. పోలీసుల కథనం ప్రకారం.. శామీర్‌పేట నివాసి గౌస్ చాలా రోజుల కిందట తన భార్య, ఇద్దరు బావమరుదులతో కలిసి రాజబొల్లారం పంచాయతీ పరిధిలోని అక్బర్జాపేటకు వలసొచ్చారు. అక్బర్జాపేటలో ఇల్లు నిర్మించుకొని, కలిసి అక్కడే ఉన్నారు. గౌస్ భార్య స్థానికంగా ఆర్‌ఎంపీగా ప్రాక్టీస్ చేసింది. కొంత కాలం తర్వాత గౌస్ కుటుంబం శామీర్‌పేటకు వెళ్లిపోయింది. గౌస్ బావమరుదులైన సయ్యద్ లతీఫ్, సయ్యద్ అల్తాఫ్ మాత్రం అక్బర్జాపేటలోనే ఉన్నారు. చికెన్ సెంటర్లను నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నారు. ఇదిలా ఉండగా.. గౌస్, బావమరుదుల మధ్య చాలా కాలంగా భూ వివాదం నడుస్తోంది. గౌస్ బుధవారం రాత్రి 10 గంటల సమయంలో బావమరుదుల ఇంటికి వచ్చాడు. భూ వివాదం విషయమై వీరి మధ్య మాటామాటా పెరిగింది. సయ్యద్ లతీఫ్, సయ్యద్ అల్తాఫ్ కలిసి కర్రతో గౌస్ తలపై మోదారు. ఆ తర్వాత కత్తితో పొడిచారు. దీంతో ఒక్కసారిగా అతడు కుప్పకూలిపోయాడు. స్థానికులు గుర్తించి వెంటనే అతడిని మెడిసిటీ ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షించి అప్పటికే అతడు మృతి చెందినట్టు గుర్తించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు.. మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. గౌస్ హత్యకు సయ్యద్ లతీఫ్, సయ్యద్ అల్తాఫ్‌తో పాటు వారి కుటుంబ సభ్యులు మెహర్ ఉన్నీసా, హాసినా బేగం, సయ్యద్ ముబీన్ కారకులుగా గుర్తించి, అరెస్టు చేసినట్టు పోలీసులు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

## నేటి నుంచి నామినేషన్లు

- పకడ్బందీగా ఎన్నికల కోడ్ అమలు, నిఘా పెంపు
- ఆర్వోలను సిద్ధం చేసిన ఎన్నికల అధికారులు

సిటీబ్యూరో, నవంబర్ 2(నమస్తే తెలంగాణ) : నామినేషన్ల ప్రక్రియ నేపథ్యంలో నేటి నుంచి మహానగరంలో పకడ్బందీగా ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందని, నిఘా మరింత పెరుగుతుందని హైదరాబాద్ ఎన్నికల అధికారి రొనాల్డ్ రాస్ వెల్లడించారు. నియోజకవర్గాల్లో ప్రత్యేక నిఘా బృందాలు నిరంతరం తిరుగుతున్నాయన్నారు. జిల్లాలో భారీగా నగదు, బంగారం, ఇతర ఆభరణాలు పట్టుబడుతున్న నేపథ్యంలో.. మరింత నిఘాను పటిష్టం చేసి తనిఖీలు పెంచేందుకు వీలుగా 18 చెక్ పోస్టులను ఏర్పాటు చేశామన్నారు.

### రిటర్నింగ్ అధికారుల కార్యాలయాలు..

| నియోజకవర్గం | రిటర్నింగ్ ఆఫీసర్ కార్యాలయం |
|---|---|
| ముషీరాబాద్(57) | తాసిల్దాల్ ఆఫీస్, ముషీరాబాద్, లోయర్ ట్యాంక్ బండ్ |
| మలక్‌పేట(58) | డిప్యూటీ కమిషనర్, సర్కిల్-6, మలక్‌పేట జీహెచ్ఎంసీ, నేషనల్ పార్కు, |
| అంబర్‌పేట(59) | తాసిల్దాల్ ఆఫీస్, అంబర్‌పేట |
| ఖైరతాబాద్(60) | జోనల్ కమిషనర్ కార్యాలయం, గ్రౌండ్ ఫ్లోర్, ఖైరతాబాద్ |
| జూబ్లీహిల్స్(61) | తాసిల్దాల్ ఆఫీస్, షేక్‌పేట, బంజారాహిల్స్ |
| సనత్‌నగర్(62 ) | డిప్యూటీ కమిషనర్ కార్యాలయం, బేగంపేట సర్కిల్-30, 3వ అంతస్తు, జోనల్ కమిషనర్ ఆఫీస్, సికింద్రాబాద్ |
| నాంపల్లి(63) | తాసిల్దార్ కార్యాలయం, ఆసిఫ్‌నగర్, విజయనగర్ కాలనీ |
| కార్వాన్(64) | తాసిల్దార్ ఆఫీస్, గోల్కొండ |
| గోషామహల్ (65) | అబిడ్స్, జీహెచ్ఎంసీ కాంప్లెక్స్, 4వ అంతస్తు |
| చార్మినార్(66) | మొఘల్‌పురా స్పోర్ట్స్ కాంప్లెక్స్, మొదటి అంతస్తు, చార్మినార్ |
| చాంద్రాయణగుట్ట(67) | తాసిల్దార్ ఆఫీస్, బండ్లగూడ |
| యాకుత్‌పురా(68) | తాసిల్దార్ ఆఫీస్, సైదాబాద్, చంపాపేట రోడ్డు |
| బహదూర్‌పురా(69) | తాసిల్దార్ ఆఫీస్, బహదూర్‌పురా |
| సికింద్రాబాద్(70) | జోనల్ కమిషనర్ ఆఫీస్, ఫస్ట్ ఫ్లోర్, సికింద్రాబాద్ జోన్, మారేడ్‌పల్లి |
| సికింద్రాబాద్ -కంటోన్మెంట్(71) | చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు, కోర్టు హౌస్ కంపౌండ్, ఎస్పీ రోడ్డు |

### రంగారెడ్డి/మేడ్చల్ జిల్లాలు..

| | |
|---|---|
| రాజేంద్రనగర్(51) | ఆర్డీవో కార్యాలయం, రాజేంద్రనగర్ |
| శేరిలింగంపల్లి(52) | జీహెచ్ఎంసీ జోనల్ ఆఫీస్, శేరిలింగంపల్లి |
| చేవెళ్ల(53) | ఆర్డీవో ఆఫీస్, చేవెళ్ల |
| షాద్‌నగర్(84) | ఆర్డీవో ఆఫీస్, షాద్‌నగర్ |
| కుత్బుల్లాపూర్(45) | డీసీ, సర్కిల్-25, జీహెచ్ఎంసీ ఆఫీస్, కుత్బుల్లాపూర్ |
| కూకట్‌పల్లి(46) | డీసీ, మూసాపేట సర్కిల్, జీహెచ్ఎంసీ ఆఫీస్ |
| మేడ్చల్(43) | ఆర్డీవో ఆఫీస్, కీసర |
| మల్కాజిగిరి(44) | జీహెచ్ఎంసీ డీసీ కార్యాలయం, మల్కాజిగిరి |
| ఉప్పల్(47) | జీహెచ్ఎంసీ డీసీ కార్యాలయం, ఉప్పల్ |
| ఇబ్రహీంపట్నం(48) | ఆర్డీవో ఆఫీస్, ఇబ్రహీంపట్నం |
| ఎల్బీ నగర్(49) | జీహెచ్ఎంసీ కార్యాలయం, సరూర్ నగర్ |
| మహేశ్వరం(50) | తాసిల్దార్ కార్యాలయం, మహేశ్వరం |